అరకొర వసతుల మధ్యే విద్యాభ్యాసం

- ఉర్దూ జూనియర్ కళాశాలలో సమస్యల తిష్ట
- సొంత భవనాలకు నోచుకోని వైనం
- తరగతి గదుల కొరత
- గెస్ట్ లెక్చరర్లతోనే బోధన


ఉర్దూ జూనియర్ కళాశాల


కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ముస్లిం విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పట్టణంలో ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ కళాశాలకు సొంత భవనాలు లేకపోవడం, తరగతి గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గెస్ట్ లెక్చరర్లే ఈ కళాశాల విద్యార్థులకు దిక్కయ్యారు. 10వ తరగతి చదువుతున్న ఉర్దూ విద్యార్థుల ఉన్నత విద్య కోసం ముస్లిం మైనార్టీ నాయకులు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో 2008లో వసంతపేటలోని 18వ వార్డు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఉర్దూ, ఇంగ్లీషు మీడియంలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. పట్టణంతోపాటు రాజుపాళెం, కమలాపురం, మైదుకూరు, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు తదితర ప్రాంతాలకు చెందిన ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. అయితే కళాశాలలో తరగతి గదుల కొరత, రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడం, సరైన ల్యాబ్ వసతి లేకపోవడం వంటి సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

16 ఏళ్లుగా అరకొర వసతులతోనే..

ఈ కళాశాల ఏర్పాటై 16 ఏళ్లు కావస్తున్నా ఇంతవరకు సొంత భవనం నిర్మించలేదు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉర్దూ కళాశాలను ఏర్పాటు చేసిన తరువాత వచ్చిన పాలకులు కళాశాల అభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. తగిన వసతులు లేకపోయినా.. చదువుకోవాలన్న ఆసక్తితో విద్యార్థులు కళాశాలకు వస్తున్నారు. కళాశాలలో ప్రిన్సిపాల్ పోస్టు మాత్రమే రెగ్యులర్ కాగా అధ్యాపకులందరూ గెస్ట్ లెక్చరర్లు. భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం బోధనకు అధ్యాపకులు లేరు. గెస్ట్‌లెక్చరర్లకు నెలకు రూ.10 వేల వేతనం ఇస్తుండటంతో వారు బోధనపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. కళాశాలలో అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని అధికారులను కోరినా.. ఎటువంటి ఉపయోగం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ప్రయోగాలు చేసుకోవడడానికి అవసరమైన ల్యాబ్‌లు కానీ, ఆడుకోవడానికి ఆటస్థలం కానీ లేదు.

తరగతి గదుల కొరత

పాఠశాలలో ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు కొన్ని తరగతి గదులను కేటాయించారు. సరిపడినన్ని గదులు లేకపోవడంతో ఉన్న గదులోనే క్లాసులు నిర్వహించే దుస్థితి నెలకొంది. గదులు ఇరుకుగా ఉండటంతో పక్క తరగతులలోని అధ్యాపకుని బోధనలు ఇతర గదుల్లోకి వినిపిస్తుంటాయి. దీంతో విద్యార్థులు ఏకాగ్రతగా పాఠాలు వినలేని పరిస్థితి. వసంతపేటకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఆనుకుని కళాశాల ఉండటంతో ఆ రోడ్డున వెళ్లే వాహనాల శబ్ద కాలుష్యంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

పరీక్షల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు

కళాశాలలో వసతులు లేకపోయినా అధ్యాపకుల కొరత ఉన్నా పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరుస్తున్నారు. వైఎస్ఆర్ జిల్లాలో 5 ఉర్దూ జూనియర్ కళాశాలలు ఉండగా గత 8 ఏళ్లుగా ఈ కళాశాల విద్యార్థులు జిల్లా మొదటి స్థానంలో నిలుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉర్దూ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించి, రెగ్యులర్ అధ్యాపకులు, ల్యాబ్ వసతి కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

సొంత భవనాలు నిర్మించాలి



పాఠశాలలోనే ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. గదులు లేక ఇరుకు గదులలోనే సర్దుకు పోతున్నాం. ప్రభుత్వం సొంత భవనాన్ని నిర్మించి మౌలిక వసతులు కల్పించి సమస్యలు పరిష్కరించాలి.

- ఆసిఫ్, విద్యార్థి, ఉర్దూ జూనియర్ కాలేజీ, ప్రొద్దుటూరు

రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి



కళాశాల ఏర్పాటు అయినప్పటి నుంచి ఇంత వరకు రెగ్యులర్ అధ్యాపకులు లేరు. గెస్ట్ లెక్చరర్లతోనే బోధన సాగుతోంది. రెగ్యులర్ అధ్యాపకులను నియమిస్తే ఎక్కువ మంది ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంది.

- ఖాదర్‌బాషా, విద్యార్థి, ఉర్దూ జూనియర్ కాలేజీ, ప్రొద్దుటూరు

క్లుప్తంగా

26 నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

చాపాడు : ఈ నెల 26, 27, 28వ తేదీలలో మండలంలోని మూడు గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ వీర కిషోర్ తెలిపారు. 26న ఎస్.ఓబాయపల్లె, 27న సోమాపురం, 28న పెద్దగురువళూరు గ్రామ సచివాలయాలలో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ శిబిరాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

ఘనంగా క్యాండిల్ లైట్ సర్వీస్


ర్యాలీ నిర్వహిస్తున్న సంఘస్తులు

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులో సగిలేరు నది ఒడ్డున ఉన్న పరిశుద్ధ పరిపేతురు పరిపాలు ఆలయంలో సోమవారం ఘనంగా క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక వైఎస్సార్ సర్కిల్ నుంచి సంఘస్తులు క్రొవ్వొత్తులతో క్రిస్మస్ పాటలతో ర్యాలీగా చర్చికి వచ్చారు. ఈ సందర్భంగా రెవ. ఫాదర్ రాజేంద్ర దైవసందేశం అందించారు. యేసుక్రీస్తు ఈ లోకాన్ని పాపం అనే చీకటి నుంచి రక్షించి వెలుగులోకి నడిపించేందుకు వచ్చారని గుర్తు చేశారు. అనంతరం క్వయర్ బృందం క్రిస్మస్ గీతాలను ఆలపించింది. కార్యక్రమంలో డీనరీ చైర్మన్ రెవ. ఆనంద్‌బాబు, రెవ. ఆసీస్‌గాబ్రియేల్‌బాబు, కమిటీ సభ్యులు, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆఫీసుల్లో క్రిస్మస్ వేడుకలు రాజ్యాంగ విరుద్ధం


మాట్లాడుతున్న వీహెచ్‌పీ, ధర్మవీర్ ప్రతినిధులు


పోరుమామిళ్ల : ప్రభుత్వ కార్యాలయాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని విశ్వహిందూ పరిషత్, ధర్మవీర్ ఆధ్యాత్మిక చైతన్య వేదిక ప్రతినిధులు ఫణిరావు, ప్రసాదరావు, శ్రీనివాసరెడ్డి, రాఘవేంద్ర, కశ్యప్, సుదర్శన్ ధర్మవీర్ పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ కొన్ని ప్రభుత్వ ఆఫీసుల్లో కొంతమంది క్రైస్తవులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారని, ఇది మత ఘర్షణలకు దారి తీస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మత కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. అలా చేస్తే చట్టరీత్యా శిక్షార్హులని పేర్కొన్నారు.

అన్నప్రసాదం వితరణ


భోజనం వడ్డిస్తున్న సేవా సంఘం సభ్యులు

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నక్కలదిన్నె గ్రామానికి చెందిన పాలగిరి యల్లారెడ్డి, ఆయన భార్య సుబ్బమ్మ, కుమారుడు సతీష్ రెడ్డి, కోడలు కీర్తి, మనుమడు సాత్విక్ రెడ్డి, మోడంపల్లెకు చెందిన ఇరగంరెడ్డి సిద్దారెడ్డి, ఆయన భార్య శకుంతలమ్మ, కుటుంబ సభ్యుల సహకారంతో అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించామన్నారు. సుమారు 800 మంది అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్న ప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షులు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ


వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న రవిప్రకాష్‌రెడ్డి

పోరుమామిళ్ల : క్రిస్మస్ సందర్భంగా సోమవారం చిత్తా శౌరిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోరుమామిళ్ల కర్మేలు ప్రార్థనా మందిరంలో 100 మంది వృద్ధులకు సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. ఎఫ్‌సీఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్ రెడ్డి దంపతులు క్రిస్మస్, నూతన సంవత్సరాల సందర్భంగా వృద్ధులు పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ దుస్తులు అందజేయగా.. వాటిని సర్పంచ్ పంపిణీ చేశారు.

నేడు 'పొలం పిలుస్తోంది'

అట్లూరు : అట్లూరు, బద్వేలు, గోపవరం, సిద్ధవటం మండలాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యాక్రమం నిర్వహించడం జరుగుతుందని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు మండల పరిధిలో ఉదయం చెన్నంపల్లి, మధ్యాహ్నం పంగాలపల్లి. గోపవరం మండల పరిధిలో ఉదయం రాచాయపేట మధ్యాహ్నం బెడుసుపల్లి. అట్లూరు మండల పరిదిలోని ఉదయం కమలకూరు మధ్యాహ్నం వలసపాళెం, సిద్ధవటం మండల పరిధిలోని ఉదయం మాచుపల్లి, మధ్యాహ్నం మూలపల్లి గ్రామాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, రైతు సేవాకేంద్రం వ్యవసాయ సహాయకులు సంబంధిత గ్రామాల రైతులు పాల్గొనాలని కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ


పరీక్ష సామగ్రి అందిస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు : స్థానిక రమణ మహర్షి ఉన్నత పాఠశాలలోని 51 మంది పదో తరగతి విద్యార్థులకు సోమవారం ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని వితరణగా అందించారు. సుద్దపల్లి శివ రాజ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన భార్య సుద్దపల్లి సుభాషిణి, కొడుకులు హర్షవర్ధన్, కృష్ణ చైతన్య, కోడళ్లు లావణ్య, ప్రణవి సహకారంతో పరీక్ష సామగ్రిని అందించారు.

అన్నదాత బాగుంటేనే దేశం బాగుంటుంది


వరి నాట్లు వేస్తున్న విద్యార్థులు

పోరుమామిళ్ల : అన్నదాత బాగుంటేనే దేశం బాగుంటుందని స్థానిక వైష్ణవి పాఠశాలలో కరస్పాండెంట్ రామకృష్ణ అన్నారు. సోమవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వైష్ణవి పాఠశాలలో కరస్పాండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రైతుల జీవన విధానం, వారు పంటలు పండించే ఒరవడిలో రైతుల కష్టం, వ్యవసాయంలో తలెత్తే ఇబ్బందులు తదితర అంశాలపై లఘునాటిక ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు రైతుల కష్టం అనుభవం ద్వారా తెలుపటానికి రామకృష్ణ వారిని పొలంలోకి తీసుకెళ్లారు. వరి నాట్లు పిల్లలతో వేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కల్యాణి మాట్లాడుతూ గతంలో పురుగుమందులు, రసాయన ఎరువులు లేని సేంద్రియ వ్యవసాయం చేసేవారని, అప్పుడు వాతావరణ కాలుష్యం, రసాయన మందులతో ఉత్పత్తి అయిన పంటలు లేవన్నారు. ఇప్పుడు వ్యవసాయానికి ప్రాధాన్యత తగ్గిందని, కాలుష్యం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, పాఠశాల ఇన్‌చార్జి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు


వాహనాలు తనిఖీ చేస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీ నిర్వహించి సరైన పత్రాలు లేని, నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్క వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. ముఖ్యంగా ఆటోడ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుతూ ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారని, ఇకపై వారిని ఉపేక్షించమని తెలిపారు. అలాగే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాయక్, కానిస్టేబుల్ గోపాల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ కార్యాలయాన్ని తరలించొద్దు


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజా పక్షం పార్టీ నాయకులు

ప్రొద్దుటూరు : కడప నగరంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని అమరావతికి తరలించొద్దని కోరుతూ ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు, న్యాయవాది పుత్తా లక్ష్మీరెడ్డి సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో అత్యంత ప్రజాదరణ కలిగి గ్రామీణ ప్రాంత రైతులకు, చిన్న పెట్టుబడిదారులకు, మధ్యతరగతి వ్యాపారులకు సేవలు అందిస్తున్న బ్యాంకును ఎందుకు తరలించాల్సి వస్తోందన్నారు. గతంలో ఉద్దేశ పూర్వకంగానే రాయలసీమ గ్రామీణ బ్యాంకును ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుగా మార్చారన్నారు. రాయలసీమను కేంద్రంగా చేసుకుని 20 ఏళ్ల కిందట 50 సెంట్ల స్థలంలో సొంత భవనం ఏర్పాటు చేసుకుని బ్యాంకు ద్వారా సేవలు అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన వికేంద్రీకరణ అంటూ ఐదు జిల్లాల కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కార్యాలయాన్ని అమరావతికి మార్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.బాలిరెడ్డి, పి.నారాయణరెడ్డి, రాము, మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

చాపాడు : మైదుకూరు సబ్ డివిజనల్ పరిధిలో శాంతి భద్రత పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ప్రత్యేక నిఘా పెట్టామని డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను సోమవారం రాత్రి డీఎస్పీ తనిఖీ చేశారు. చాపాడు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన అన్ని రకకాలైన కేసులకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. ఇందులో పూర్తయిన కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన కేసులతో పాటు దొంగతనాలపై ఆరాతీశారు. పోలీసు స్టేషన్‌లో పని సిబ్బంది వివరాలు, పని తీరును డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ.. ఏడాది సాధారణ తనిఖీ కార్యక్రమంలో భాగంగా పోలీసుస్టేషన్‌ను విజిట్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్నపెద్దయ్య పాల్గొన్నారు.

ఓపెన్ పాఠశాలల యాజమాన్యంపై ఫిర్యాదు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ఓపెన్ పాఠశాలలను నిర్వహించకుండా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓపెన్ పాఠశాలలు తరగతులు నిర్వహించకుండా ఫీజులు వసూలు చేసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని అటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దాదాపు 7వేలకు పైగా ఓపెన్ విద్యకు అభ్యసకులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే జిల్లాలో ఎక్కడ కూడా తరగతులు నిర్వహించకుండా పరీక్షల సమయంలో హాల్ టికెట్ జారీ చేసి అభ్యర్థుల నుంచి వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు.

విద్యుత్ ఉద్యమానికి తరలిరండి

పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : విద్యుత్ చార్జీల పెంపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రాచమల్లు సోమవారం తన స్వగృహంలో మున్సిపాలిటీ పరిధిలోని కార్యకర్తలు, నాయకులు, కౌన్సిలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ప్రజల వద్ద నుంచి ఓట్లను సంపాదించేందుకు చంద్రబాబు నాయుడు పార్టీ చెప్పిన పచ్చి అబద్ధం విద్యుత్ బిల్లులు పెంచం, పైగా తగ్గించడంతోపాటు నాణ్యతగల కరెంట్ ఇస్తామని బహిరంగ సభల్లో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇది ప్రజలను నూటికి నూరు శాతం ఉద్దేశ పూర్వకంగా మోసం చేయడమేనన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సుమారు రూ.16వేల కోట్ల భారం వేసి ప్రజల నడ్డి విరిచారన్నారు. ఇంతటితో చార్జీల పెంపు ఆగదని, త్వరలో మరో రూ.8 వేల కోట్ల భారాన్ని మోపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ప్రకారం వచ్చే నాలుగేళ్లలో విపరీతంగా కరెంటు చార్జీలను పెంచి ప్రజల నుంచి డబ్బు వసూలు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ నెలలోనే తొలి మారు విద్యుత్ చార్జీలు పెరిగాయని, జనవరిలో రెండో బిల్లు వస్తుందన్నారు. చలికాలం కావడంతో విద్యుత్ వినియోగం తగ్గి ప్రజలకు విద్యుత్ చార్జీల భారం కనిపించడం లేదన్నారు. వేసవిలో ఈ ప్రభావం ఎంతగా ఉంటుందో అర్థమవుతుందని తెలిపారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో రానున్న విద్యుత్ చార్జీలను చూసి ప్రజలు షాక్ గురయ్యే పరిస్థితి ఉంటుందని అన్నారు. 2029 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి కరెంట్ షాక్ తప్పదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ పోరాటం చేస్తున్నారన్నారు. పెంచిన రూ.16 వేల కోట్ల విద్యుత్ చార్జీలను ప్రజలపై భారం వేయకుండా ప్రభుత్వమే చెల్లించాలని కోరుతూ ప్రజల పక్షాన ఈ నెల 27న కడపలో నిర్వహించనున్న విద్యుత్ ఉద్యమానికి తరలి రావాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో భారీ స్థాయిలో పార్టీ ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తపరిచి, పెంచిన బిల్లులను ఉపసంహరించాలని మెమొరాండం ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు ఆయిల్‌మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డిలతోపాటు ఆయా వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలతో ఈ సమావేశం నిర్వహించారు. విద్యుత్ ఉద్యమానికి ఎంత మంది, ఏవిధంగా, ఎక్కడి నుంచి ఎవరు తరలి వెళ్లాలన్న విషయంపై చర్చించడం జరిగిందన్నారు. మంగళవారం గ్రామీణ ప్రాంతాల నాయకులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ అంశానికి సంబంధించి పార్టీ సెంట్రల్ ఆఫీస్ ద్వారా ఎస్పీకి ముందుగా సమాచారం ఇచ్చి అనుమతి తీసుకోవడం జరుగుతుందన్నారు. శాంతియుతంగా నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

సబ్‌జైలు సందర్శన


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ బాబాఫకృద్దీన్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సబ్‌జైలును సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ సందర్శించారు. ఇందులో భాగంగా జైలు పరిసరాలను, వసతిగదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించి అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను సబ్‌జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలను, ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు ఉంటే మండల న్యాయసేవా సమితిని, జిల్లా న్యాయసేవా అధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి, కోర్టు సిబ్బంది, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని విద్యామందిర్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న జి.తేజోమయి చదరంగం పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఈనెల 22న బెంగుళూరు నగరం వైట్‌ఫీల్డ్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బెంగుళూరు రూరల్ డిస్ట్రిక్ట్ చెస్ అసోసియేషన్ పోటీల్లో అండర్-16 విభాగంలో తేజోమయి 3వస్థానంలో నిలిచినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు.

జంతుశాస్త్రంలో డాక్టరేట్

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగంలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న వై.అపర్ణకు తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. జంతుశాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఎం.శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో 'ఎపికెసీ ఆఫ్ బయోఫ్లాక్స్ ఇన్ ద కల్చర్ ఆపరేషన్ ఆఫ్ పసిఫిక్ వైట్ ప్రిమ్స్ లితోపీనియస్ వనామీ' అన్న అంశంపై ఈమె చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి


నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వం వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శి బి.పీటర్ డిమాండ్ చేశారు. స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు రూ.2,100 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన రూ.1,480 కోట్లు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారని, విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీఓ నంబర్ 77ను రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సంయుక్త కార్యదర్శి రాహుల్, నాని, తౌసిఫ్, వాసు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి


ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

బద్వేలు అర్బన్ : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ డీఈఈ కుళాయప్ప, ఏఈ ఎం.చిన్నయ్యలు పేర్కొన్నారు. మండల పరిధిలోని చింతలచెరువు పంచాయతీ బయనపల్లె గ్రామంలో నేచురల్ ఎనర్జీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న సోలార్ రూఫ్‌టాప్‌లను నిర్మించుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చన్నారు. అలాగే ఇంధన వనరుల పొదుపు అనేది ప్రతిఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాబూరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గణిత మేధావి రామానుజన్


రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కాశినాయన : గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ అని ఎంఈఓ నిర్మల అన్నారు. సోమవారం మండలంలోని పిట్టిగుంట ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు గానుగపెంట రమణారెడ్డి ఆధ్వర్యంలో శ్రీనివాసరామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామానుజన్ జీవితచరిత్రపై విద్యార్థులకు టాలెంట్ పరీక్ష నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండవ బహుమతిగా రూ.2500, మూడవ బహుమతిగా రూ.వెయ్యిలను ఎంఈఓ నిర్మల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తుల తయారీలో అగ్రస్థానం

కడప ఎడ్యుకేషన్ : ఆహార ఉత్పత్తుల తయారీలో భారతదేశం అగ్రస్థానంలో ఉందని యోగివేమన విశ్వవిదాలయ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని హ్యాపీ కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫార్మర్స్ మార్కెట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. రోటరీ క్లబ్ కో చైర్మన్ మహమ్మద్ తాజుద్దీన్, కరస్పాండెంట్ అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శివకుమారి పాల్గొన్నారు.